www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 21 మార్చి 2023

5

ఏలూరు



రేపు ఏలూరులో ఉగాది సాంస్కృతిక సమ్మేళనం

ప్రజాశక్తి - ఏలూరు

ఈ నెల 22న ఉగాది సాంస్కృతిక సమ్మేళనం జయప్రదం చేయాలని పలు సంఘాల నేతలు కోరారు. సమ్మేళనం ఏలూరులోని యుటిఎఫ్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం మూడు గంటలకు నిర్వహించనున్నట్లు ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, మానవత ఏలూరు జోన్ ఛైర్మన్ పి.డి.రత్నాకర్‌రావు, మండల ఛైర్మన్ అడుసుమిల్లి నిర్మల, హేలాపురి బాలోత్సవం అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు, కోశాధికారి విజిఎంఎవిఆర్.కృష్ణారావు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్.రవికుమార్, పి.వి.నరసింహారావు, శ్రీ అక్షరం ఆర్ట్స్ ఛైర్మన్ డి.రాములు, హేలాపురి చైతన్య వేదిక కన్వీనర్ కె.రామాంజనేయులు, ఐద్వా జిల్లా కన్వీనర్ పి.హైమావతి ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు పరిసర ప్రాంతాల వారు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రజాస్వామ్యమా.. రాచరికమా..!

అంగన్‌వాడీలపై ప్రభుత్వ దమనకాండ

చలో విజయవాడకు వెళ్లనీయకుండా తీవ్ర నిర్బంధం, అరెస్టులు

కలపర్రు టోల్‌గేట్ వద్ద అడ్డుకుని పోలీస్‌స్టేషన్లకు తరలింపు

నిరసనలతో హోరెత్తిన పోలీసు స్టేషన్లు

ఏలూరులోని కల్యాణ మండపంలో గేట్లు వేసి నిర్బంధకాండ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

అంగన్వాడీలపై ప్రభుత్వం సాగించిన నిర్బంధకాండ చూసి మనం ప్రజాస్వామ్య పాలనలో ఉన్నామా.. లేక రాచరిక పాలనలో ఉన్నామా అనే అనుమానం కలుగుతోంది. తమ సమస్యల పరిష్కారం కోసం సోమవారం చలో విజయవాడ కార్యక్రమానికి వెళుతున్న అంగన్వాడీలపై ప్రభుత్వం వ్యవహరించిన తీరు అత్యంత దారుణంగా ఉంది. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతిఒక్కరికీ ఉంటుంది. ప్రజల హక్కులను కాలరాస్తూ వైసిపి ప్రభుత్వం నిరంకుశ ధోరణితో ముందుకు సాగుతోంది. వాహనాల్లో వెళ్తున్న వివిధ జిల్లాలకు చెందిన అంగన్వాడీలను ఏలూరు కలపర్రు టోల్‌గేట్ వద్ద అడ్డగించిన పోలీసులు తీవ్ర నిర్బంధం ప్రయోగించారు. తూర్పుగోదావరి, విశాఖతోపాటు జిల్లాలోని పలు మండలాలకు చెందిన అంగన్వాడీలను విజయవాడ వెళ్లకుండా అడ్డుకుని పోలీస్‌స్టేషన్లకు తరలించి నిర్బంధించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం మూడుగంటల వరకు టిఫిన్, తాగునీరు లేక, పోలీస్‌స్టేషన్ల వద్ద మరుగుదొడ్లు వంటివి లేక అంగన్వాడీలు పడ్డ ఇబ్బందులు వర్ణనాతీతం. జిల్లాతోపాటు వివిధ జిల్లాలకు చెందిన అంగన్వాడీలను కలపర్రు టోల్‌గేట్ వద్ద అడ్డుకుని పెదపాడు, ఏలూరు రూరల్ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. విషయం తెలుసుకుని అక్కడకు చేరిన సిఐటియు నాయకులు అంగన్వాడీలతో కలిసి పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. దీంతో ఏలూరు వన్‌టౌన్ పెరుగుచెట్టు సమీపంలోని శ్రీ సీతారామ భర్తియా కళ్యాణ మండపంలో దాదాపు 150 మంది అంగన్వాడీలను నిర్బంధించి గేట్లు మూసివేశారు. దీంతో నిర్బంధించిన అంగన్వాడీలను విడుదల చేయాలని సిఐటియు నాయకులు ఆర్.లింగరాజు, బి.సోమయ్యతోపాటు పలువురు నాయకులు అక్కడకు చేరుకుని రోడ్డుపై పడుకుని నిరసన చేపట్టారు. సిఎం డౌన్‌డౌన్ అంటూ అంగన్వాడీలు చేసిన నినాదాలు హోరెత్తాయి. సచివాలయ మహిళా పోలీసులను రంగంలోకి దించి అంగన్వాడీలపై తీవ్ర నిర్బంధం ప్రయోగించిన పరిస్థితి ఉంది. జంగారెడ్డిగూడెం, చింతలపూడి, పెదపాడు, నూజివీడు, ఉంగుటూరు, భీమవరం, తణుకు, పాలకొల్లు, నరసాపురం తదితర ప్రాంతాల్లో అంగన్వాడీలపై తీవ్ర నిర్బంధకాండ సాగింది. తాము అధికారంలోకి వస్తే తెలంగాణ రాష్ట్రం కంటే అదనంగా రూ.వెయ్యి వేతనం ఇస్తామని చెప్పిన వైసిపి నాలుగేళ్లయినా ఆ ఊసే మరిచిపోయింది. కనీస వేతనం అమలు చేయాలని, ఉద్యోగ విరమణ బెనిఫిట్స్ అందించాలని, ఫేస్‌యాప్ రద్దు చేయాలని, జీతాలు, ఇతర బకాయిలు వెంటనే చెల్లించాలనే డిమాండ్లతో చలో విజయవాడకు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్న అంగన్వాడీలను ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలోనూ ఇదేవిధంగా అంగన్వాడీలను ఇబ్బంది పెట్టిన పరిస్థితి ఉంది. అదే టిడిపి పతనానికి కారణమైంది. ఇప్పుడు వైసిపి సైతం అదేబాటలో పయనిస్తోంది. తమ హక్కులపై గళం విప్పుతున్న ఉద్యోగులపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు తీవ్ర చర్చనీయాంశమైంది.



ఏలూరులోని సీతారామభర్తియా కళ్యాణ మండపంలో నిర్బంధానికి గురైన అంగన్వాడీలు

వడగండ్ల వాన

ప్రజాశక్తి - జీలుగుమిల్లి


జీలుగుమిల్లిలో సోమవారం సాయంత్రం ఈదురుగాలులతో వడగళ్ల వర్షం కురిసింది. అకాల వర్షానికి రహదారులన్నీ జలమయమయ్యాయి. అకాల వర్షానికి పలుచోట్ల పంటలు దెబ్బతిన్నాయి. మిర్చి, మొక్కజొన్న, పొగాకు, జీడిమామిడి, మామిడి, పుచ్చపంటలు దెబ్బతిన్నాయి. గాలులకు పలుచోట్ల జాతీయ రహదారిపై భారీ వృక్షాల కొమ్మలు పడటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వెంటనే పోలీసులు అప్రమత్తమై చెట్ల కొమ్మలను తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. జీలుగుమిల్లి గ్రామంలో రాజు అనే వ్యక్తి షెడ్డుపై రేకులు లేచిపోవడంతో ఇంట్లోని సామాను తడిసిముద్దయ్యింది. సిటిఆర్‌వి సమీపంలో ఆగి ఉన్న ఆటోపై చెట్ల కొమ్మలు పడటంతో ఆటో ధ్వంసమైంది.



చెట్టు పడి ధ్వంసమైన ఆటో

పంటలను పరిశీలించిన ఉద్యాన శాఖాధికారి


మండలంలోని వంకవారిగూడెం, జీలుగుమిల్లిల్లో అకాల వర్షాలకు నేలమట్టమైన దొండ తోటలను కొయ్యలగూడెం ఉద్యాన శాఖాధికారి ప్రసన్నలక్ష్మి పరిశీలించారు.



ఏలూరులో మోకాళ్లపై నిలబడి నేతల నిరసన



ఏలూరు రూరల్ పోలీసు స్టేషన్ వద్ద ఆందోళన



నూజివీడులో..

జిఒ 1 రద్దు కోరుతూ వినూత్న నిరసన

ప్రజాశక్తి - ఏలూరు

జిఒ నెం.1ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజా సంఘాలు తలపెట్టిన చలో విజయవాడకు తరలివెళ్తున్న వారిపై పోలీసు నిర్బంధం ప్రయోగించడాన్ని ఖండిస్తూ స్థానిక పాత బస్టాండ్ సెంటర్ వద్ద ప్రజాసంఘాలు, వామపక్షాల నేతలు సోమవారం మోకాళ్లపై నిలబడి వినూత్న నిరసన తెలిపారు. సిపిఎం నగర కార్యదర్శి పి.కిషోర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాన్నుద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ బండి వెంకటేశ్వరరావు, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి కాకి నాని, ఆలిండియా లాయర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వి.శైలజ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల గొంతు నొక్కడానికి జిఒ నెం.1 తెచ్చిందని విమర్శించారు. బ్రిటీష్ ప్రభుత్వ హయాంలో తెచ్చినటువంటి ఈ జిఒను వైసిపి ప్రభుత్వం అమలు చేయాలనుకోవడం దారుణమన్నారు. అంగన్వాడీలు తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని విజయవాడ వెళ్తుంటే ఇళ్ల వద్దే అడ్డుకోవడాన్ని ఖండించారు. జిఒ నెం.1ని తక్షణమే రద్దు చేయాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పివి.రామకృష్ణ, రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, సిఐటియు నాయకులు బి.జగన్నాథరావు, జి.గోపి, వైఎస్.కనకారావు, వివిఎన్.ప్రసాద్, ఎం.ఇస్సాక్, రవీంద్ర, జి.కోటేశ్వరరావు, ఏసుబాబు, సిపిఐ నాయకులు బల్ల కనకదుర్గారావు, గేదెల నాగేశ్వరరావు, గురవయ్య, గుబ్బల ప్రభాకర్, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు కాకర్ల అప్పారావు, పిడిఎస్‌యు నాయకులు క్రాంతి, వినోద్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్‌బాబు, చేతివృత్తిదారుల జిల్లా కన్వీనర్ పి.ఆదిశేషు పాల్గొన్నారు.

కుక్కునూరు: జిఒ నెం.1ని తక్షణం రద్దు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి యర్రంశెట్టి నాగేంద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం, సిపిఐ (ఎంఎల్) ప్రజాపంథా ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహశీల్దార్ ప్రమద్వరకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాగేంద్రరావు మాటాడారు. కార్యక్రమంలో నేతలు కల్లయ్య, కొండా ప్రసాద్, శ్రీను, మహబూబ్‌పాషా, వలీపాషా పాల్గొన్నారు.

రైతుసంఘం నేత నర్సింహా అరెస్టు

నూజివీడు రూరల్: జిఒ నెం.1ని రద్దు చేయాలని చలో విజయవాడకు బయల్దేరిన ఏపి రైతుసంఘం ఏలూరు జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ నరసింహను పోలీసులు అరెస్టు చేసి రూరల్ స్టేషన్‌కు తరలించారు.

అడుగడుగునా నిర్బంధం..

జిల్లా వ్యాప్తంగా సిఐటియు నేతలు, అంగన్వాడీల అరెస్టులు

పలుచోట్ల పోలీస్ స్టేషన్ల ఎదుట అంగన్వాడీల ఆందోళన

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

తమ సమస్యల పరిష్కారం కోరుతూ చలో విజయవాడ కార్యక్రమం చేపట్టిన అంగన్వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం పోలీసు నిర్బంధంతో ఉక్కుపాదం మోపింది. జిల్లా నలుమూలల నుండి విజయవాడ వెళ్లేందుకు బస్సులు, రైళ్లు, ప్రయివేటు వాహనాల్లో బయల్దేరిన అంగన్వాడీలను జాతీయ రహదారిపై కలపర్రు టోల్‌గేట్ వద్ద బలవంతంగా వాహనాలు దింపి పెదపాడు పోలీస్ స్టేషన్, ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్, సీతారంభర్తియా కళ్యాణ మండపం తదితర ప్రాంతాలకు తరలించారు. దాదాపు 500 మంది అంగన్వాడీలనూ అక్రమంగా అరెస్టు చేసి నిర్బంధించారు. ఈ అరెస్టులు, నిర్బంధానికి వ్యతిరేకంగా అంగన్వాడీలు ఆయా స్టేషన్ల ముందు, మర్చంట్ ఛాంబర్ కార్యాలయం ముందు పెద్దఎత్తున తమ నిరసన తెలిపారు. అక్రమ అరెస్టులను నిరసిస్తూ సిఐటియు, ప్రజాసంఘాలు ఆధ్వర్యాన చేపట్టిన ఆందోళనకు సిపిఎం మద్దతు ప్రకటించింది. ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్ నుండి భర్తియాఛాంబర్ కళ్యాణ మండపం వరకు ర్యాలీ నిర్వహించారు. అరెస్ట్ చేసిన వారిని విడుదల చేయాలంటూ అక్కడే రోడ్డుపై పడుకుని వినూత్నరీతిలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి సిపిఎం నగర కార్యదర్శి పి.కిషోర్, సిఐటియు నగర అధ్యక్ష కార్యదర్శులు బి.జగన్నాథరావు, వి.సాయిబాబు, ఆటోవర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జె.గోపి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లెనిన్, మెడికల్ రిప్స్ రాష్ట్ర నాయకులు ప్రసాద్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జాన్‌బాబు, అంగన్వాడీ యూనియన్ ఏలూరు ప్రాజెక్టు అధ్యక్షురాలు రజిని, జిల్లా నాయకులు పిఎల్ఎస్.కుమారి, తదితరులు నాయకత్వం వహించారు.

రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ చర్యలను ఆంధ్రప్రదేశ్ చేతి వత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు, కోకన్వీనర్ ఆగోల్ల వెంకట కృష్ణారావు తీవ్రంగా ఖండించారు స్థానిక ఆర్ఆర్‌పేటలోని వృత్తిదారుల జిల్లా కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. అక్రమంగా అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

జంగారెడ్డిగూడెం: సమస్యల పరిష్కారం కోరుతూ విజయవాడ ధర్నాకు బయల్దేరిన అంగన్వాడీలను పోలీసులు సోమవారం ఉదయం అడ్డుకున్నారు. స్థానిక బస్టాండుకు చేరుకున్న అంగన్వాడీలను విజయవాడ వెళ్లకుండా బస్టాండులోనే నిర్బంధించారు. దీంతో తీవ్ర ఆగ్రహంతో అంగన్వాడీలు అక్కడే బైఠాయించి నిరసన తెలిపారు. ఈ నిరసనకు పలు ప్రజాసంఘాలు మద్దతు పలికాయి. అనంతరం బస్టాండ్ నుండి ఆర్‌డిఒ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం ధర్నా చేపట్టారు. ఓ దశలో అంగన్వాడీల ఆందోళనను పట్టించుకోని ఆర్‌డిఒ ఝాన్సీరాణి తీరును నిరసిస్తూ అక్కడే బైఠాయించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కార్యదర్శి పి.భారతి మాట్లాడుతూ అంగన్వాడీలు కేంద్రాల్లో కనీస వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీల సమస్యలపై ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి స్పందించి పాదయాత్రలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. అనంతరం ఆర్‌డిఒ ఝాన్సీరాణికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మానుకొండ జీవరత్నం, నేత అందుగుల ప్రభాకర్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్, మాబు సుభాని, సిఐటియు నేతలు పి.సూర్యారావు, ఎస్‌కె.సుభాషిని, వంగా గోపి, అంగన్వాడీలు పాల్గొన్నారు. అంగన్వాడీలపై నిర్బంధాన్ని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ ఖండించారు.



జంగారెడ్డిగూడెంలో..

చింతలపూడి: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విజయవాడ ధర్నాకు వెళ్తున్న అంగన్వాడీలను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని సిఐటియు నేతలు నత్త వెంకటేశ్వరావు, ఎస్.సూర్యకుమార్, ఐద్వా నేత వరలక్ష్మి ఖండించారు. అక్రమ అరెస్టులు నిరసిస్తూ స్థానిక పోలీసు స్టేషన్ వద్ద నిర్వహించిన ధర్నానుద్దేశించి వారు మాట్లాడారు. అర్ధరాత్రి వెళ్లి మహిళలకు నోటీసులివ్వడం దారుణమన్నారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి రమాదేవి, లక్ష్మి తదితరులు నాయకత్వం వహించారు.

మండవల్లి: అక్రమ అరెస్టులు చేసి ఉద్యమాలను ఆపలేరని అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ మండవల్లి ప్రాజెక్టు నేత వాణి స్పష్టం చేశారు. విజయవాడ ధర్నాకు వెళ్తున్న తమను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తీరు మార్చుకుని అంగన్వాడీలపై రాజకీయ ఒత్తిళ్లను ఉపసంహరించుకుని పెండింగ్ జీతాలను వెంటనే విడుదల చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

ద్వారకాతిరుమల: విజయవాడలో తలపెట్టిన ధర్నాకు వెళ్లనీయకుండా మండలంలోని అంగన్వాడీలను పోలీసులు ముందస్తుగా గృహనిర్బంధం చేశారు. పలువురు కార్యకర్తల ఇళ్లకు సచివాలయ మహిళా కార్యదర్శులు వెళ్లి విజయవాడ వెళ్లొద్దంటూ నోటీసులిచ్చి బయటకు వెళ్లకుండా అడ్డుకున్నారు.

పెదపాడు: చలో విజయవాడకు వెళ్తున్న అంగన్వాడీలను అక్రమంగా అరెస్టు చేసి పెదపాడు పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించడాన్ని నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. కాకినాడ, విశాఖపట్నం, పశ్చిమగోదావరి తదితర జిల్లాల నుండి విజయవాడ వెళ్తున్న అంగన్వాడీలను కలపర్రు టోల్‌గేట్ వద్ద ఆదివారం అర్ధరాత్రి, సోమవారం తెల్లవారుజామున అరెస్టు చేసి పెదపాడు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో సిఐటియు ఆధ్వర్యాన చేపట్టిన ఆందోళనకు ఎపి రైతుసంఘం, సిపిఎం నాయకులు, కార్యకర్తలు సంఘీభావం తెలిపారు. ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, సిఐటియు మండల కార్యదర్శి రెడ్డి లక్ష్మణరావు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కాకినాడ జిల్లా నాయకులు ఫాతిమా, సిపిఎం మండల నాయకులు షేక్ కరీముల్లా మాట్లాడారు. ప్రభుత్వ నిర్బంధాన్ని ఖండించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎ.శాంతరత్నం, పి.కనకతులసి, సిహెచ్.రాణి పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: చలో విజయవాడకు వెళ్తున్న అంగన్వాడీలను, మధ్యాహ్న భోజన కార్మికులను ఎక్కడికక్కడ అరెస్టు చేయడం దారుణమని సిఐటియు నేత శుక్లబోయిన రాంబాబు అన్నారు. కొయ్యలగూడెంలో ప్రభుత్వ నిర్బంధంపై నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఆకుల దుర్గారావు, తగర ధనరాజు, కె.సీతారాముడు, ఎస్.శివకుమార్, సిహెచ్.మరిడియ్య పాల్గొన్నారు.

జీలుగుమిల్లి: అంగన్వాడీలు, మధ్యాహ్న భోజన కార్మికులపై నిర్బంధాన్ని నిరసిస్తూ సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యాన సోమవారం స్థానిక జాతీయ రహదారిపై నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ అంగన్వాడీల న్యాయమైన సమస్యలు తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు, నేతలు జి.వెంకట్రావు, ఎన్‌వి.అప్పారావు, సిఐటియు నేతలు సిహెచ్.కొండలరావు,కారం భాస్కర్, శ్రీను, మొడియం లక్ష్మి, ఎన్.భీమశంకరం పాల్గొన్నారు.

టి.నరసాపురం: చలో విజయవాడకు వెళ్లనీయకుండా మండలంలోని బండివారిగూడేనికి చెందిన అంగన్వాడీ సెక్టార్ లీడర్ సత్యవతిని పోలీసులు ఇంటి వద్దే నిర్బంధించారు. సోమవారం ఉదయం విజయవాడ బయల్దేరిన పలువురిని మార్గమధ్యంలోనే అడ్డుకున్నారు. చింతలపూడి, నూజివీడు పోలీసుస్టేషన్లలో మక్కినవారిగూడెం ప్రాంత అంగన్వాడీలను నిర్బంధించారు. పోలీసుల తీరును సిఐటియు మండల కార్యదర్శి తుమ్మల సత్యనారాయణ ఖండించారు.

కుక్కునూరు: అంగన్వాడీ, మధ్యాహ్న భోజనకార్మికులు చేపట్టిన చలో విజయవాడకు వెళ్లనీయకుండా నిర్బంధించడాన్ని నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం కుక్కునూరు ప్రధాన రహదారిపై నిరసన తెలిపారు. నిరసనలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు యర్రంశెట్టి నాగేంద్రరావు, సిఐటియు నేతలు యర్నం సాయికిరణ్, ఎం.రమాదేవి, అన్నపూర్ణ, సౌజన్య, కృష్ణవేణి, వెంకటేశ్వర్లు, శివ, రమేష్, ఉదయ్ పాల్గొన్నారు.

ఉంగుటూరు: విజయవాడ ధర్నాకు వెళ్తున్న అంగన్వాడీ కార్యకర్తలను చేబ్రోలు పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. అంగన్‌వాడీల ఆందోళనకు కొర్ని అప్పారావు సంఘీభావం తెలిపారు.

వేలేరుపాడు: ఉక్కుపాదంతో కార్మిక ఉద్యమాలను ఆపలేరని సిఐటియు జిల్లా నాయకులు మడివి దుర్గారావు అన్నారు. దుర్గారావును సోమవారం స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. అంగన్వాడీ, సిఐటియు నేతల అక్రమ అరెస్టులను సిపిఎం మండల కార్యదర్శి ధర్మాల రమేష్ ఖండించారు.

నూజివీడు: అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిన ముఖ్యమంత్రి అక్రమ అరెస్టులకు పాల్పడటం దారుణమని సిఐటియు జిల్లా కార్యదర్శి జి.రాజు, ఎన్ఆర్.హనుమాన్ అన్నారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

బుట్టాయగూడెం: మండలం నుండి విజయవాడ వెళ్తున్న అంగన్వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులను తడికలపూడి వద్ద అరెస్ట్ చేశారు. అలాగే మండలంలోని అంగన్వాడీలను, మధ్యాహ్న భోజన కార్మికులను పోలీసులు ఎక్కడికక్కడ గృహనిర్బంధం చేశారు.



ఉంగుటూరు పోలీసు స్టేషన్ వద్ద



చింతలపూడిలో..

డిసిసిబి మాజీ ఛైర్మన్

వట్టి వెంకటరంగ పార్థసారథి మృతి

ప్రజాశక్తి - భీమడోలు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనమండలి మాజీ సభ్యులు వట్టి వెంకట రంగపార్థసారథి (92) వయోభారంతో ఆదివారం రాత్రి విజయవాడలోని ప్రయివేటు ఆసుపత్రిలో కన్నుమూశారు. భీమడోలు మండలం పూళ్ల పంచాయతీ పరిధిలోని ఎంఎంపురం ప్రాంతానికి చెందిన పార్థసారథి 1931లో జన్మించారు. కాంగ్రెస్ నేతగా పార్థసారథి తన హయాంలో పలు పార్టీ పదవులు, పలు ప్రభుత్వ విభాగాల సభ్యునిగా కొనసాగారు. 1995–97 నడుమ కేంద్ర వ్యవసాయ కమిషన్ ధరల నిర్ధారక త్రిసభ్య కమిటీలో సభ్యులుగా పనిచేశారు. 1982–86 మధ్య శాసనమండలి సభ్యులుగా పని చేశారు. 1968–74, 1992–95 నడుమ డిసిసిబి ఛైర్మన్‌గా సేవలందించారు. 1955–97 మధ్య వివిధ హోదాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నియమించే కమిటీ సభ్యునిగా సేవలందించారు. ఇటీవల సారధి కుమారుడు, మాజీ మంత్రి వట్టి వసంత్‌కుమార్ మృతి చెందిన విషయం తెలిసిందే.




పార్థసారథి అంత్యక్రియలను ఆయన స్వగ్రామమైన ఎంఎంపురంలో వారి కుటుంబ సభ్యులు సోమవారం సాయంత్రం నిర్వహించారు. ప్రభుత్వ లాంఛనాలతో కార్యక్రమం నిర్వహించారు. పార్థసారథి మృతి వార్త తెలియగానే పెద్దఎత్తున ప్రముఖులు తరలొచ్చారు. మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, మాజీ ఎంఎల్ఎ గన్ని వీరాంజనేయులు, మానవత జిల్లా అధ్యక్షులు రామిశెట్టి గంగాధర రావు ,భీమడోలు, గుండుగొలను సొసైటీ అధ్యక్షులు రావిపాటి సత్య శ్రీనివాస్, వివివి.భాస్కర్, సర్పంచ్ దాయం సుజాత ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు యర్రంశెట్టి ఏడుకొండలు ఇతర ప్రముఖులు పార్థసారథి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్థసారథి కుటుంబ సభ్యులను ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అర్జీలను సంతృప్తికరంగా పరిష్కరించాలి

స్పందనలో 302 అర్జీలు స్వీకరణ - కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమానికి వచ్చే అర్జీలను సంతృప్తికరంగా, నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ అధికారులను ఆదేశించారు. మండలస్థాయి ఆడిట్ కమిటీ ప్రతి సోమవారం పరిష్కరించిన స్పందన అర్జీలను ఆడిట్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో జిల్లాస్థాయి స్పందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ప్రసన్నవెంకటేష్, జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు, డిఆర్ఒ ఎవిఎస్ఎన్.మూర్తి, జెడ్‌పి సిఇఒ రవికుమార్, డిఆర్‌డిఎ పీడీ విజయరాజు, పోలవరం ఎస్‌డిసి సూర్యనారాయణరెడ్డి, కెఆర్ఆర్‌సి ఎస్‌డిసి జివివి.సత్యనారాయణతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

చినవెంకన్న సన్నిధిలో నేపాల్ మాజీ ఉపరాష్ట్రపతి

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల వెంకటేశ్వర స్వామి వారిని నేపాల్ మాజీ ఉప రాష్ట్రపతి పరమానందఝా సోమవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆల య అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వేద పండితులు వేద మం త్రాలతో ఆశీర్వచనం చేశారు. శాలువాతో సత్కరించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు.

ఎన్‌హెచ్ఎ చీఫ్ జనరల్ మేనేజర్

ద్వారకాతిరుమల వెంకటేశ్వర స్వామిని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా చీఫ్ జనరల్ మేనేజర్ రాజీవ్ అగర్వాల్, విజయవాడ రీజినల్ ఆఫీస్ నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా రాకేష్ కుమార్‌సింగ్ సోమవారం ఉదయం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు అధికారులు ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు. తొలుత వారు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అర్చకులు దుశ్శాలువా కప్పి వేద ఆశీర్వచనం చేశారు. ఆలయ ఎఇఒ మెట్లపల్లి శ్రీనివాస్ జ్ఞాపిక అందించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డి.వి.భాస్కర్‌రావు పాల్గొన్నారు.

22న అమర్ జవాన్ చిహ్నం ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లా మాజీ సైనికోద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న సంఘ కార్యాలయంలో ఈ నెల 22న తేదీ బుధవారం ఉదయం పది గంటలకు అమర్ జవాన్ జవాన్ (స్థూపాన్ని) కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆవిష్కరిస్తారని జిల్లా మాజీ సర్వీస్‌మెన్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పి.వి.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి రాహుల్ దేవ్ శర్మ ఇద్దరు ఆర్మీ జనరల్ పాల్గొంటారని తెలిపారు.

నేడు కలెక్టరేట్ వద్ద చేతివృత్తిదారుల ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

చేతివృత్తిదారులకు రాష్ట్ర బడ్జెట్‌లో రూ.50 వేల కోట్లు కేటాయించాలని, సామాజిక రక్షణ చట్టం చేయాలని కోరుతూ ఈ నెల 21న ఏలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు ఎపి చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు, జిల్లా కో కన్వీనర్ వెంకటకృష్ణారావు తెలిపారు. స్థానిక ఆర్ఆర్ పేటలోని చేతి వృత్తి దారుల జిల్లా కార్యాలయంలో సోమవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ 21న నిర్వహించే ధర్నాలో జిల్లాలోని చేతి వృత్తిదారులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఉపాధి హామీ పనులు 200 రోజులు కల్పించాలి

ప్రజాశక్తి - చాట్రాయి

మండల కేంద్రమైన చాట్రాయిలోని సాయిబాబా కమ్యూనిటీ హాలులో సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం మండల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పిల్లి రామకృష్ణ పాల్గొని మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు 200 రోజులు పని దినాలు కల్పించాలన్నారు. ఏప్రిల్ 5వ తేదీన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం చలో ఢిల్లీ కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షురాలు గొల్లమందల శ్రీదేవి అధ్యక్షత వహించగా మండల కార్యదర్శి మేడేపల్లి హెూలీమేరీ, సిపిఎం మండల కార్యదర్శి భాస్కరరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలని వినతి

ప్రజాశక్తి - ముసునూరు

వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సిపిఎం జిల్లా నాయకులు జి.రాజు కోరారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద పొగాకు రైతులు సోమవారం ఆందోళన చేశారు. అనంతరం తహశీల్దార్ దాసరి సుధకు వినతపత్రం అందించారు. ఈ సందర్భంగా జి.రాజు మాట్లాడుతూ రైతులకు పంట నష్ట పరిహారం ఇవ్వాలని కోరారు. సిసిఎం ఆధ్వర్యంలో మండల వ్యవసాయ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పిల్లి మురళి, మానికల పంగిడియ్య, మీగడ భద్రాచలం, శ్రీను, రంగారావు పాల్గొన్నారు.

14 నుంచి గ్రామసభలు

ప్రజాశక్తి - మండవల్లి

గ్రామస్తుల భాగస్వామ్యంతో గ్రామ సభలను నిర్వహిస్తేనే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని ప్రజాస్వామ్య పరిరక్షణ వేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు అప్పారావు అన్నారు. ఏప్రిల్ 14 నుంచి మండలంలో నిర్వహించే గ్రామ సభలను ప్రజల భాగస్వామ్యంతో విజయవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం స్పందనలో అర్జీ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పరిపాలన సజావుగా పారదర్శకంగా నడవడానికి గ్రామసభలు ఎంతగానో దోహదపడతాయన్నారు. అలాంటి గ్రామ సభలకు ప్రజలను హాజరు పరచడంలో అధికారులు విఫలమవుతున్నారని విమర్శించారు. ఏప్రిల్ 14 నుంచి నిర్వహించే గ్రామసభల నిర్వహణపై వారం రోజుల ముందుగానే గ్రామంలో విస్తృత ప్రచారం చేయించి ఆయా శాఖలకు చెందిన అధికారులను గ్రామ సభలకు హాజరయ్యేలా చర్యలు తీసుకుని గ్రామాల అభివద్ధికి సహకరించాలని వారు కోరారు. అనంతరం తహశీల్దార్ పి.సతీష్‌కి మండల పరిషత్ కార్యాలయం ఎఒ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు.

ఎఐటియుసి మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - చింతలపూడి

అసంఘటిత రంగ కార్మికులకు సమగ్రమైన చట్టం రూపొందించాలని, మున్సిపల్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న హెల్త్ అలవెన్స్ విడుదల చేయాలని ఎఐటియుసి మండల అధ్యక్షులు టి.బాబు కోరారు. ఎఐటియుసి మండల కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. ఏరియా కౌన్సిల్ గౌరవ అధ్యక్షులుగా టివిఎస్.రాజు, అధ్యక్షులుగా టి.బాబు, కార్యదర్శిగా కంకిపాటి బుచ్చిబాబు, కోశాధికారిగా గంధం అంజమ్మ, ఉపాధ్యక్షులుగా పట్నాల రామిరెడ్డి, కె.శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శులుగా చేపల్లి శ్రీనివాసరావు, నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం టి.బాబు మాట్లాడుతూ పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని, స్కూల్ స్వీపర్స్‌కి రూ.10,500 జీతం ఇవ్వాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణకు వంట పాత్రలు ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరారు.

నేరాలు - ఘోరాలు

బ్రిడ్జిపై నుంచి కిందపడిన కారు

ముగ్గురికి గాయాలు - ఆసుపత్రికి తరలింపు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్ / దెందులూరు

కారు అదుపుతప్పి బ్రిడ్జిపై నుంచి కింద పడిన సంఘటనలో ముగ్గురు గాయాలపాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విజయవాడ ఆటోనగర్‌కు చెందిన తలపాక శివాజీ సోదరి వివాహానికి కుటుంబ సభ్యులు, బంధువులు శ్రీకాకుళం జిల్లా పలాస వెళ్లారు. వివాహం అనంతరం శివాజీ అతని మేనమామలు ఈసం లోవరాజు, ఈసం నూకరాజు కారులో విజయవాడ బయలుదేరారు. ఈ క్రమంలో దెందులూరు మండలం సోమవరప్పాడు బ్రిడ్జి వద్దకు వచ్చేసరికి కారు అదుపుతప్పి బ్రిడ్జిపై నుంచి కింద పడిపోయింది. ఈ ప్రమాదంలో గాయాలపాలైన ముగ్గురిని స్థానికులు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నిర్మాణంలోని వంతెనకు జాగ్రత్తలు సూచిస్తూ ఏ విధమైన బోర్డులు లేకపోవటం, వంతెనకు ఇనుప రైలింగ్ సైతం లేకపోవటంతో కారు బ్రిడ్జిపై నుంచి కిందికు పడిపోయింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

జీలుగుమిల్లి : ఇంటికి కరెంట్ కట్ చేశారని వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన సోమవారం పి.అంకంపాలెం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మొవ్వ శ్రీను ఇంటికి కరెంట్ కట్ చేశారని మనస్తాపానికి గురైన అతను సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు, స్థానికులు అతడిని కామయ్యపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

ముగ్గురు గంజాయి విక్రేతలు అరెస్ట్

జంగారెడ్డిగూడెం : గుట్టుగా గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ సాగర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని ఒ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్న గంజాయి విక్రేతలు షేక్ ఇలియాజ్, ఆళ్ల రాజేష్, వట్టి దుర్గారావును ముందస్తు సమచారం మేరకు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి మూడు కిలోల గంజాయి, రూ.500 నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు.

'ఆరోగ్యశ్రీ'లో అవకతవకలకు పాల్పడితే చర్యలు

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో సేవలందేలా కృషి చేయాలని, ఫిర్యాదులను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సంబంధిత వైద్య సిబ్బందిని, అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో జిల్లా క్రమ శిక్షణ కమిటీ (డీడీసీ) సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆరోగ్య మిత్ర సర్వీసు సేవాలోపం, నెట్ వర్క్ ఆసుపత్రుల సేవాలోపం, చికిత్స అనంతరం ఉచితంగా మందుల పంపిణీ అంశాలకు సంబంధించి విచారణ నిర్వహించారు. ఫిర్యాదులకు సంబంధించి సంబంధిత ఆరోగ్య మిత్రపై చర్యలు తీసుకున్నారు. వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం జిల్లాలో అమలుతీరు, అందుబాటులో ఉన్న ఆరోగ్య మిత్రాలు, టీం లీడర్లు, అర్జీల స్వీకరణ, పరిష్కార వ్యవస్థ తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో నాణ్యమైన వైద్య సేవలు అందేలా చూడాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ నెట్‌వర్క్ ప్రయివేట్ ఆసుపత్రుల్లో ఉచిత వైద్య సేవలందించే క్రమంలో ఎవరైనా అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సమావేశంలో కమిటీ సభ్యులు వైద్య విధాన పరిషత్ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎవిఆర్.మోహన్, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ రత్నకుమారి, ఆరోగ్యశ్రీ జిల్లా మేనేజర్ అంజాద్, టీం లీడర్లు రాజా, సుప్రియ, భారతి, వివిధ సచివాలయాల సంబంధిత ఎఎన్ఎంలు, ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల ఎండిలు, ఆరోగ్య మిత్రాలు హాజరయ్యారు.

'స్పందన' ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

స్పందన కార్యక్రమంలో ఫిర్యాదులపై వెంటనే విచారణ చేపట్టి పరిష్కరించాలని జిల్లా ఎస్‌పి రాహుల దేవ్‌శర్మ ఆదేశించారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలమూలల నుంచి ఫిర్యాదుదారులు ఎస్‌పికి ఫిర్యాదులు చేశారు. ఎక్కువగా వరకట్న వేధింపులు, సరిహద్దుల విషయంలో గొడవలు, సివిల్ వివాదాలపై ఫిర్యాదులు ఇచ్చినట్లు ఎస్‌పి తెలిపారు. ఈ ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలన్నారు. ఈ స్పందన కార్యక్రమంలో ట్రైనింగ్ ఐఎఎస్ అధికారి అపూర్వభరత్ పాల్గొన్నారు.

చాట్రాయి : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో స్పందన అర్జీలను నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ స్వీకరించారు. గ్రామ రెవెన్యూ కార్యదర్శులను గ్రామాల్లో ఉన్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. వివిధ గ్రామాల నుంచి స్వీకరించిన తొమ్మిది అర్జీలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం ఆదర్శ రాజేంద్రన్ మీడియాతో మాట్లాడుతూ విలేకర్లు ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకునే విధంగా సహాయ పడాలన్నారు. అవినీతి అక్రమాలు జరిగితే తన దృష్టికి తీసుకువస్తే చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కో-ఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, తహశీల్దార్ సిహెచ్.విశ్వనాథ రావు, ఎంపిడిఒ ఎస్.మురళీమోహన్, వ్యవసాయశాఖ అధికారి బి.శివశంకర్, ఎంఇఒ బి.వెంకటేశ్వరరావు, ఎస్ఐ జగపతి, వైఎస్ఆర్ క్రాంతి పథం ఎపిఎం టి.శేఖర్, ఇఒపిఆర్‌డి ఎంవిఎస్.నాగరాజు పాల్గొన్నారు.

ముసునూరు : రైతుల స్థలాలు జగనన్న కాలనీలకు కేటాయించి వారికి ఆర్థిక సాయం అందించకపోవడం అన్యాయమని జనసేన నూజివీడు నియోజకవర్గ నాయకులు పాశం నాగబాబు అన్నారు. మండలంలోని బలివే గ్రామానికి చెందిన నలుగురికి చెందిన భూమిని జగనన్న కాలనీలకు కేటాయించేటప్పుడు స్థలాలకు ఆర్థిక సాయం చేస్తామని, లేకపోతే ఆ భూమికి సరిపడ భూమిని వేరే ప్రదేశంలో కేటాయిస్తామని రెవెన్యూ అధికారులు చెప్పి మూడేళ్లవుతున్నా ఎలాంటి పరిహారం లేదని సోమవారం స్పందన కార్యక్రమంలో జనసేన నాయకులు అర్జీ అందించారు.

న్యాయవాదికే న్యాయం కరువు..!

విధులు బహిష్కరించి లాయర్ల నిరసన

ప్రజాశక్తి - నూజివీడు

న్యాయవాది కుటుంబం పట్ల పోలీసుల తీరును నిరసిస్తూ బార్ కౌన్సిల్ అధ్యక్షుడు ఇందుపల్లి సత్య ప్రకాష్ ఆధ్వర్యంలో న్యాయవాదులు సోమవారం కోర్ట్ విధులను బహిష్కరించి తమ నిరసన వ్యక్తం చేశారు. పోలీసుల జులుం నశించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నూజివీడు బార్ కౌన్సిల్ అధ్యక్షుడు ఇందుపల్లి సత్యప్రకాష్ మాట్లాడుతూ బెజవాడ బార్ అసోసియేషన్ న్యాయవాది విజయవాడలోని భవానిపురంలో నివాసం ఉంటారు. పది రోజుల క్రితం తన పదేళ్ల కుమార్తె ఇంటి వద్ద ఉన్న పార్కులో ఆడుకుంటున్న సమయంలో ఒక వ్యక్తి చేతిలో లైంగిక దాడికి గురైందన్నారు. ఆ విషయంపై న్యాయవాది కుటుంబం ఫిర్యాదు చేసేందుకు భవానిపురం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారన్నారు. అదే సమయంలో బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడిని, అతని కుటుంబం కూడా స్టేషన్‌కు వెళ్లారన్నారు. పోలీసు వారు న్యాయవాది కుటుంబాన్ని దిశ పోలీస్‌స్టేషన్‌కి వెళ్లి ఫిర్యాదు చేయాలని సూచించారన్నారు. దీంతో న్యాయవాది ఆయన కుటుంబ సభ్యులు దిశ పోలీస్‌స్టేషన్‌కు బయలుదేరారు. న్యాయవాది దృష్టి మరల్చి వెంటనే 30 నిమిషాల వ్యవధిలో లైంగిక దాడికి పాల్పడిన నిందితుడని తల్లితో న్యాయవాదిపై 354, 324 సెక్షన్లతో ఎఫ్ఐఆర్ కట్టించారన్నారు. న్యాయవాది దిశలో చేసిన ఫిర్యాదును తెల్లవారుజామున రిజిస్టర్ చేశారన్నారు. దీంతో ఆశ్చర్యపోయిన న్యాయవాది తన కుమా ర్తెకు అన్యాయం జరిగితే కేసును నీరుగార్చి తిరిగి తన మీదే తప్పుడు కేసు పెట్టడంపై న్యాయం చేయాలని కోరుతూ కొన్ని రోజుల నుంచి కోర్టు చుట్టూ తిరుగుతున్నారన్నారు. తన కుమార్తెకు అన్యాయం జరిగితే ఎవరూ అండగా లేరని, తన పరిస్థితి దయనీయంగా ఉందని న్యాయవాది విలపి స్తున్నారని చెప్పారు. న్యాయవాదులంతా ఏకతాటిపై వచ్చి బాధిత న్యాయవాదికి ఆయన కుటుంబ సభ్యులకు న్యాయం జరిగే వరకు నిరసనలు వ్యక్తం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నిరసనలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో మెరుగైన సౌకర్యాల కల్పన

అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎంపిపి రాంబాబు

ప్రజాశక్తి - చింతలపూడి



మాట్లాడుతున్న ఎంపిపి రాంబాబు

యర్రగుంటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పూర్తిస్థాయి సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటామని చింతలపూడి ఎంపిపి రాంబాబు తెలిపారు. మండలంలోని యర్రగుంటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి మానస అధ్యక్షతన సోమవారం నిర్వహించిన అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపిపి రాంబాబు మాట్లాడుతూ పిహెచ్‌సిలో అదనపు వసతి కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వైద్య శాఖ సిబ్బంది రోగులకు మెరుగైన సేవలు అందించి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఆసుపత్రిలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కృష్ణజ్యోతి, సర్పంచి రాణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్య బాధితునికి సర్పంచి దంపతుల సాయం

ప్రజాశక్తి - భీమడోలు

ఆర్థిక పరిస్థితుల కారణంగా చికిత్స చేయించుకునేందుకు ఇబ్బంది పడుతున్న గ్రామానికి చెందిన యువకుడిని ఆదుకునేందుకు పొలసానిపల్లి సర్పంచి దంపతులు షేక్ రహీమా బేగం హసేన, షేక్ హసేన దంపతులు ముందుకు వచ్చారు. వీరు ఆ యువకుని చికిత్స కోసం అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందించడంతో పాటు, అతడిని చికిత్స కోసం గుంటూరుకు తరలించేందుకు అంబులెన్స్ సౌకర్యాన్ని వ్యక్తిగత ఖర్చుతో ఏర్పాటు చేశారు. గ్రామంలోని 12వ వార్డుకు చెందిన కూన శివప్రసాద్‌కు అనారోగ్యం కారణంగా ఇబ్బందులు ఏర్పడటంతో ఏలూరులోని ప్రయివేట్ వైద్యశాలకు తరలించారు. అక్కడ కొనసాగిన చికిత్సకు రోగి కుటుంబ సభ్యుల వద్ద ఉన్న సొమ్ములు పూర్తిస్థాయిలో ఖర్చయ్యాయి. ఆ తరువాత సదరు ప్రయివేట్ వైద్యశాల వారు శివప్రసాద్‌ను మెరుగైన చికిత్స కోసం గుంటూరు తరలించాలని సూచించారు. దీంతో దిక్కుతోచని కూన శివప్రసాద్ కుటుంబ సభ్యులు అతనిని పొలసానిపల్లిలోని ఇంటికి తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న సర్పంచి దంపతులు శివప్రసాద్‌ను చికిత్స కోసం గుంటూరు తరలించేందుకు అంబులెన్స్ ఏర్పాటు చేశారు. చికిత్స కోసం కొంత మొత్తాన్ని అందించారు.

నోటి శుభ్రతతో కేన్సర్ దూరం

ప్రజాశక్తి - పోలవరం

ప్రతి నిత్యం నోటి శుభ్రతతో క్యాన్సర్‌ను దూరం చేయవచ్చని డాక్టర్ సాయి సునంద దేవి అన్నారు. జాతీయ నోటి శుభ్రత దినోత్సవం సందర్భంగా ఎల్లండిపేట ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో నోటి శుభ్రత, నోటి ద్వారా వచ్చే వ్యాధులు, నోటి వ్యాధుల నివారణ పట్ల రోగులకు సోమవారం అవగాహన కల్పించారు. ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న గూటాల, కొత్త పట్టిసీమ, కుంకాల, చేగొండపల్లి గ్రామాల్లో సబ్ సెంటర్ల వద్ద, పాఠశాలల విద్యార్థులకు నోటి శుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

గణపవరం : నోటి శుభ్రతపై దృష్టి పెట్టకపోతే అనారోగ్య పాలవుతారని గణపవరం ఆరోగ్య కేంద్రం డాక్టర్లు పి.సంతోషనాయుడు, పి.కిరణ్మయి అన్నారు. ప్రపంచ దంత ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పిహెచ్‌సి ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాల విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు.

నేడు 'మానవత' ఆధ్వర్యంలో చీరలు, దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - గణపవరం

స్థానిక కన్యకా పరమేశ్వరి వర్తక సంఘ భవనంలో వృద్ధులకు, వికలాంగులకు మంగళవారం దుప్పట్లు, చీరలు అందిస్తున్నట్లు మానవత సంస్థ మండల కమిటీ అధ్యక్షులు వంకాయల రామారావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు హాజరవుతారని తెలిపారు.

అగ్ని ప్రమాద బాధితులకు మాగంటి బాబు సాయం

ప్రజాశక్తి - వేలేరుపాడు

కన్నాయిగుట్ట గ్రామంలో కొన్నిరోజుల క్రితం సంభవించిన అగ్ని ప్రమాదంలో నిరాశ్రయులైన 27 కుటుంబాలను మాజీ ఎంపీ మాగంటి బాబు సోమవారం పరామర్శించారు. టిడిపి పోలవరం నియోజకవర్గ నాయకులు శ్రీనివాసులు, పార్టీ మండల సభ్యులతో కలిసి పరామర్శించారు. బాధిత కుటుంబాలకు నిత్యవసర సరుకులు, వంట సామగ్రి, దుస్తులు, కూరగాయలు అందించారు. బాధిత కుటుంబాలకు భవిష్యత్‌లో ఏ అవసరం వచ్చినా చేదోడుగా ఉంటానని మాగంటి బాబు చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు అమరవరపు అశోక్, ప్రధాన కార్యదర్శి కట్టం రాంబాబు, ఎస్‌టి సెల్ రాష్ట్ర కార్యదర్శి గొంది నాగేశ్వరరావు, ఏలూరు పార్లమెంట్ తెలుగురైతు కార్యదర్శి చీమల వెంకటేశ్వర్లు, ఏలూరు పార్లమెంట్ తెలుగురైతు ఉపాధ్యక్షులు ఉండవల్లి సోమసుందరం, పరిమి రాంబాబు, పార్టీ పోలవరం మండల అధ్యక్షులు బొడ్డు కృష్ణ పాల్గొన్నారు.

టిడిపి నేతల నిరసన

ప్రజాశక్తి - భీమడోలు

సోమవారం నిర్వహించిన శాసనసభ సమావేశంలో పాల్గొన్న టిడిపి ఎంఎల్ఎ, దళిత సామాజిక తరగతికి చెందిన డోలా బాల వీరాంజనేయ స్వామిపై, సీనియర్ సభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరిపై వైసిపి ఎంఎల్ఎలు దాడి చేశారని ఆరోపిస్తూ భీమడోలులో టిడిపి నేతలు నిరసన కార్యక్రమాన్ని సోమవారం సాయంత్రం చేపట్టారు. సంతపేటలోని అంబేద్కర్ విగ్రహం వద్ద టిడిపి నేతలు కళ్లకు నల్ల రిబ్బన్ కట్టుకుని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, టిడిపి నేతలు కరణం పెద్దిరాజు, సిరిబత్తిన కొండబాబు, పి.యుగంధర్, ఆర్.రాజ్‌కపూర్ పాల్గొన్నారు.

కైకలూరు : నియోజకవర్గంలోని బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి టిడిపి నేతలు నిరసన తెలిపారు. బేషరతుగా టిడిపి ఎంఎల్ఎ బాల వీరాంజనేయులుకు వైసిపి ఎంఎల్ఎలు క్షమాపణ చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు యాళ్ల కృపారావు, ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, ఎస్‌సి సెల్ రాష్ట్ర కార్యదర్శి పి.జోసఫ్‌తంబి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రామారావు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని పొట్లగట్లగూడెంలో ఇటీవల మృతి చెందిన టిడిపి సీనియర్ నాయకులు, గ్రామ మాజీ అధ్యక్షులు, ఎంపిటిసి మాజీ సభ్యులు పాతకాకుల ముక్కుయ్య కుటుంబానికి టిడిపి రాష్ట్ర ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి ఆకుమర్తి రామారావు ఆర్థిక సహాయం అందించారు. పొట్లగట్లగూడెంలో బాధిత కుటుంబ సభ్యులను ఆకుమర్తి రామారావు సోమవారం పరామర్శించి రూ.ఐదు వేలు, 25 కిలోల బియ్యం అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు సత్యనారాయణ, అద్దేపల్లి రవికుమార్, కంకిపాటి భార్గవ, ఎంపిటిసి సభ్యులు రాంబాబు పాల్గొన్నారు.

భార్గవికి పలువురి అభినందన

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడికి చెందిన భార్గవి జాతీయ స్థాయి క్రీడలో రాణించటం అభినందనీయమని రాయల్ క్లబ్ అధ్యక్షులు నరసింహారావు అన్నారు. చింతలపూడికి చెందిన విస్సంతరావు సూర్యనారాయణ, రాజేశ్వరి దంపతుల కుమార్తె భార్గవి పదో తరగతి చదువుతోంది. భార్గవి జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచింది. ఆల్ ఇండియా ఇంటర్ ఎస్ఎఐ మీట్ పోటీలో, పంజాబ్‌లోని పటియాల షాట్‌పుట్‌లో గోల్డ్ మెడల్, చిల్డ్రన్ కేటాగిరిలో గోల్డెమెడల్, జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ స్టేట్ మీట్‌లో జావాలిన్‌లో బ్రౌంజ్‌మెడల్ సాధించింది. ఈ సందర్భంగా భార్గవికి సుబ్బారాయుడు గూడెంలో యర్రంశెట్టి రామకృష్ణారావు (రేము) గృహంలో రాయల్ క్లబ్ సభ్యుల ఆర్థిక సాయంతో క్రీడాసామగ్రికి, దుస్తులకు, షూస్ కోసం రూ.16 వేలు నగదు బహుమతి అందించారు. ఈ కార్యక్రమంలో గంధం చంటి, రాజేష్, గుమ్మళ్ల నరసింహారావు, చిక్కాల నాగేశ్వరరావు, శ్రీనివాస రావు, ఎస్ఎస్.గాంధీ, చిన్నంశెట్టి సీతారామయ్య, బొడ్డు వెంకటేశ్వరరావు, ఆది జగన్, కురుశెట్టి విజయ్, తోట పూర్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మీర్జాపురం సొసైటీ రైతాంగానికి ఆర్థిక అక్షరాస్యతపై సోమవారం అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కెడిసిసి హనుమాన్ జంక్షన్ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ ఎం.సాహితి ఖాతాదారుల హక్కులు, ఫిర్యాదుల పరిష్కారం, మొబైల్ బ్యాంకింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ పి.సుధ, సూపర్‌వైజర్ సిహెచ్‌విఎన్.రామారావు, సిఇఒ నాగేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

తాగునీటి బోరుకు మరమ్మతులు

ఉంగుటూరు : నారాయణపురం సచివాలయం-2 పరిధిలో ఎన్‌టిఆర్ కాలనీలో గత దశాబ్ద కాలంగా నిరుపయోగంగా పడి ఉన్న తాగునీటి బోరు ప్రక్షాళన కార్యక్రమం చేపట్టారు. ఇక్కడ బోరు సుమారుగా పదేళ్లుగా నిరుపయోగంగా ఉంది. కాలనీ జనాభా ఏడాదికేడాది పెరుగుతోంది. ప్రస్తుతానికి వైఎస్ఆర్ కాలనీలో ఉన్న తాగునీటి బోరు నుంచి ఒ హెచ్ఆర్ ట్యాంకు ద్వారా వైఎస్ఆర్, ఎన్‌టిఆర్ కాలనీ ప్రజలకు నీరు అందిస్తున్నారు. ఏదైనా సమస్య వస్తే నీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ బోరు కూడా వినియోగంలోకి వస్తే వేసవిలో నీటి సమస్యలు తలెత్తవని స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సమస్యను గుర్తించి పరిష్కర చర్యలు చేపట్టిన సర్పంచి అలకనందకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

పలు గ్రామాల్లో వైద్య శిబిరాలు

బుట్టాయగూడెం : దొరమామిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మూరుమూల గ్రామాలైన చింతకొండ, గొట్టాలరేవు, పూచికగొంది గ్రామాల్లో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ఎఎన్‌వి.ప్రవీణ్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన అవసరమన్నారు. వేసవికాలంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి ఎల్.సుబ్రహ్మ ణ్యం, జె.వాసంతి, జి.ప్రమోదిని, కన్నప్పరాజు, జగదాంభ, గంగాభవాని పాల్గొన్నారు.